క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తోటవారి వీధి ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో 58వ డివిజన్‌లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటవారి వీధి, వైఎస్సార్ రోడ్డు, సిద్దార్థ వీధి, సాగి హనుమంతరావు వీధి, వినాయక కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులంతా గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ



పాయకాపురం(విజయవాడరూరల్): జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు అతి కిరాతకంగా జరిపిన దాడిలో మరణించిన హిందువుల కుటుంబాలకు క్యోఇకు కరాటే అకాడమీ విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ బుధవారం రవీంద్ర థియేటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. క్యోఇకు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బల్లం కిషోర్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని చెప్పారు. ఇది పిరికిపంద చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో భారతదేశ ప్రజలు భయపడరని, ఉగ్రవాదానికి తలదించబోరన్నారు. భారతదేశ సమగ్రత, సమైఖ్యతను సార్వభౌమత్వాన్ని దెబ్బతీయలేరని తెలిపారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వాంబే కాలనీకి చెందిన మాజేటి శ్రీపూజితకు మణికంఠ ఫణికుమార్ శర్మ (హైదరాబాద్)కు 2018లో వివాహం జరిగింది. పెళ్లి అయిన సంవత్సరం నుంచి భర్త ప్రతి రోజూ మద్యం తాగి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేయడం, తల్లిదండ్రులకు ఫోను చేసి అసభ్యకరంగా మాట్లాడం చేస్తున్నాడు. వేధింపులు భరించలేక విజయవాడ వాంబేకాలనీలో పుట్టింటికి వచ్చి భర్త వేధింపులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచితంగా పుస్తకాలు పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో బుధవారం ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేశారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ, చైతన్య కళాశాలలపై ఫిర్యాదు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మోసపూరిత ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న నారాయణ, చైతన్య కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం గవర్నర్‌పేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం స్టేషన్ వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయంటూ నారాయణ, చైతన్య కళాశాలలు ప్రచారం చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేశాయన్నారు. వేరే రాష్ట్రాల్లో చదువుకొని జేఈఈలో అత్యుత్తమ ర్యాంకులతో రాణించిన విద్యార్థులను తమ విద్యార్థులుగా పేర్కొంటూ ప్రకటనలు గుప్పించాయన్నారు. నారాయణ, చైతన్య కళాశాలలు తమ విద్యార్థులుగా ప్రకటించిన ఇతర రాష్ట్రాల విద్యార్థుల వివరాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మోసపూరిత ప్రకటనలు చేసి విద్యార్థులను మభ్యపెడుతున్న నారాయణ, చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయా విద్యా సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తూ ప్రకటనలు ఇస్తున్న సినీనటులు శ్రీలీల, అల్లు అర్జున్‌లపై కేసులు నమోదు చేయాలని కోరారు.

పేదింటి విద్యా కుసుమాలు

- ప్రతి మది మురిసేలా.. 'పది'లమైన మార్కులు భళా
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 550 పైగా మార్కులు సాధించి సత్తా చాటిన విద్యార్థులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమను చదివిస్తున్న అమ్మానాన్నల కష్టాలు.. వారి లక్ష్యానికి తొలి అడుగులుగా మలుచుకున్నారు... తమ గురువుల బోధనలను ఆయుధాలుగా మార్చుకున్నారు.. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఒక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు.. కఠోర దీక్ష బూనినట్లుగా ఏడాదంతా చదువుపైనే దృష్టిసారించారు.. నేడు ప్రతి మది మురిపించేలా 'పది'లో ఎన్నడూ చెరిగిపోని పదిలమైన మార్కులను సాధించి.. అందరి చేతా భళా బాలలు అనిపించుకున్నారు... ఇదీ బుధవారం వెలువడిన పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విజయగాథ.

కార్పొరేట్‌కు ధీటుగా మార్కుల వరద

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరుగుల వరదను సృష్టించారు. ఇక్కడున్న నాలుగు పాఠశాలల్లోనే 60 మందికి పైగా విద్యార్థులు 500 పైగా మార్కులను సాధించి అందరి ప్రశంసలను అందుకుంటున్నారు.

పేదల ఇళ్లల్లో ....

నిరుపేద ప్రజలు జీవిస్తున్న న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ, సింగ్‌నగర్ ప్రాంతాల్లోని పలువురు విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారు.

- జేడీఎం హైస్కూల్‌లో 585 మార్కులతో టాప్ స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి కార్పొరేషన్ హైస్కూల్‌లో దిడ్డి అను 585 మార్కులతో స్కూల్ ఫస్ట్ రాగా తోట శ్రీదుర్గావైష్ణవి 572 మార్కులు, చిక్కవరపు హృషికేష్ వరుణ్ 539 మార్కులు, పల్లా దీపక్‌కు 535 మార్కులను తెచ్చుకోగా మొత్తం 13 మంది 500 పైగా మార్కులను సాధించారు. ఈ స్కూల్ నుంచి 89 మంది పరీక్షలకు హాజరుకాగా 78 పాసయ్యి 88 శాతం ఉత్తీర్ణతను సాధించారు.
- స్థానిక 57వ డివిజన్‌లోని దేవినేని వెంకట రమణ మున్సిపల్ హైస్కూల్‌లో జి.అజయ్ కుమార్ 565 మార్కులతో స్కూల్ ఫస్ట్ రాగా పి.వైష్ణవి 546 మార్కులు, ఎం.సజిన్ 542 మార్కులు తెచ్చుకోగా 17 మంది వరకూ 500పైగా మార్కులను సాధించారు. మొత్తం 89 మంది విద్యార్థులు హాజరుకాగా 82 మంది పాసై 92 శాతం ఉత్తీర్ణతను పొందారు.
- స్థానిక 59వ డివిజన్‌లోని ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో సీహెచ్ మనోజ్ కుమార్ 558 మార్కులతో స్కూల్ ఫస్ట్ రాగా టి.అనీష 555 మార్కులు, జీవీవీఎన్ఎస్ఎస్ జశ్వంత్ 551 మార్కులు, డి.ధరణి ప్రియ 551 మార్కులు తెచ్చుకోవడంతో పాటు 10 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు.
- వివేకానంద సెంటినరీ హైస్కూల్ తెలుగు మీడియంలో ఎస్. ప్రశాంత్ కుమార్ 554 మార్కులు, కె.నాగవజ్రనందిని 538 మార్కులు, ఎండీ పర్వీన్ చాందిని 537 మార్కులు తెచ్చుకోగా మరో 7 మంది 500 పైగా మార్కులను తెచ్చుకొని నూరుశాతం ఉత్తీర్ణతను సాధించారు.

నాన్న కష్టాలను చూసి చలించి



మా నాన్న ఉమాశంకర్ లారీ డ్రైవర్. అమ్మ లక్ష్మీప్రసన్న. నాన్న మమ్ములను చదివించడం కోసం ప్రతి రోజూ ఎంతో కష్టపడేవారు. ఆయన కష్టాన్ని చూసిన నేను ఎలా అయినా బాగా చదివి మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదివాను. స్కూల్ ఫస్ట్ రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో మంచి ఇంజినీర్ అయ్యి దేశానికి సేవ చేయాలనేది నా కల.

– జి.అజయ్‌కుమార్,(565 మార్కులు)

ఉన్నత చదువులు అభ్యసించాలి



పదో తరగతిలో వచ్చిన మార్కులపైనే మన జీవితం ఆధారపడి ఉంటుందని ఉపాధ్యాయులు పదే పదే చెప్పడం.. మా తల్లిదండ్రులు మమ్మల్ని చదివించేందుకు ఎదుర్కొంటున్న కష్టాలను చూసి ఎలా స్కూల్ టాపర్‌గా రావాలని నిశ్చయించుకొని ఆ దిశగా సాధన చేసి విజయం సాధించాను. భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులను అభ్యసించి.. పెద్ద ఉద్యోగం సాధించి.. సమాజంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు నా వంతు కృషిచేయాలనే నా జీవిత ఆశయం.

– సీహెచ్ మనోజ్‌కుమార్(558 మార్కులు)

అమ్మ కష్టాన్ని.. ఆమె నమ్మకాన్ని నిలబెట్టాలని



నన్ను చదివించడం కోసం.. నాకు మంచి భవిష్యత్తును అందించడం కోసం అమ్మ ఎంతో కష్టపడుతుంది. ఆమె కష్టాన్ని.. నమ్మకాన్ని నిలబెట్టాలని చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టాను. మంచి మార్కులు వచ్చాయి. చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది నా ఆకాంక్ష.

– ఎస్.ప్రశాంత్‌కుమార్(554 మార్కులు)

ఐఏఎస్ సాధించాలనేది నా లక్ష్యం



చిన్ననాటి నుంచి నాకు చదువు అంటే ఎంతో ఇష్టం. పెద్దయ్యాక ఐఏఎస్ అవ్వాలనేది నా లక్ష్యం. చదువుపై నాకున్న ఆసక్తిని గమనించి నా తల్లిదండ్రులు పైడిరాజు, యల్లమ్మలు నన్ను కష్టపడి చదివించి ప్రోత్సహిస్తున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఇన్ని మార్కులు సాధించగలిగాను. ఇంకా బాగా చదివి ఐఏఎస్ పూర్తిచేసి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తాను.

– దిడ్డి అను (582 మార్కులు)

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తా



చదువు వల్ల మాత్రమే మనం జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని మా తల్లిదండ్రులు శివరామకృష్ణ ప్రసాద్, నాగరాణిలు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ఆ మాటల ప్రేరణ, టీచర్ల ప్రత్యేక శిక్షణ వల్ల ఇంత మంచి మార్కులను సాధించగలిగాను. నాకు సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రతిభ కనబర్చాలని.. ప్రపంచస్థాయిలో మన దేశానికి మంచి గుర్తింపు తీసుకురావాలనేది నా ఆశయం.

– తోట శ్రీదుర్గావైష్ణవి(572 మార్కులు)

మున్సిపల్ స్కూళ్లలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఏకేటీపీ స్కూల్‌లో విద్యార్థి ప్రణీత్‌ను సత్కరిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు



నడకుదురు శ్రావ్య నాగప్రమీల (577)



భువన అను లక్ష్మి వికాసిని (564)



మల్లాది సాహితి (562)



592 మార్కులు సాధించిన ప్రణీత్



హేమశిరి 575

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 64వ డివిజన్ కుందావారి కండ్రికలో బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్ బాలికలు అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. పేద కుటుంబాల్లో జన్మించిన బాలికలు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి హైస్కూల్‌కు మంచిపేరు తీసుకొచ్చారు. నడకుదురు శ్రావ్య నాగప్రమీల 577 మార్కులు సాధించి హైస్కూల్ టాపర్‌గా నిలిచింది. ఆ విద్యార్థిని తండ్రి విజయసారథి తాపీ మేస్త్రీ, తల్లి శాంతి కుమారి బట్టలషాపులో వర్కర్. ఆ విద్యార్థి డాక్టర్ కావడం తన లక్ష్యమని చెప్పింది. రెండో టాపర్ అదారి భువన అను లక్ష్మి వికాసిని 564 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని తండ్రి హేమంత్ రైతు మార్కెట్‌లో పనిచేస్తుంటాడు. తల్లి నాగశ్రీ టైలర్. మూడో టాపర్ మల్లాది సాహితి 562 మార్కులు సాధించింది. హైస్కూల్ నుంచి మొత్తం 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 88 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయుడు కేవీ దుర్గారావు వెల్లడించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 23 మంది 500 పైగా మార్కులు సాధించగా, హైస్కూల్ టాపర్ అక్షయ 575 మార్కులు, రెండో టాపర్ హర్షవర్ధన్ 571 మార్కులు, శ్రీహిత, కృష్ణమోహన్ 566 మార్కులు చొప్పున మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారు. రాజీవ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్ నుంచి తెలుగు మీడియంలో 30 మందికి గాను 18 మంది, ఇంగ్లీషు మీడియంలో 39 మందికి గాను 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు తెలియజేశారు.

సత్తాచాటిన ఏకేటీపీ మున్సిపల్ స్కూల్ విద్యార్థులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో సత్యనారాయణపురంలోని ఏకేటీపీ నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 592 మార్కులతో కె.ప్రణీత్ కుమార్ స్కూల్ టాపర్‌గాను, ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల ఉత్తీర్ణతలో రెండవ స్థానంలో నిలిచాడు. ఏకేటీపీ స్కూల్‌లో మొత్తం 320 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా అందులో 259 మంది ఉత్తీర్ణతతో 81 శాతం ఫలితాలు సాధించారు. వారిలో వి.వి.డి.వి సూర్యవంశీ 587, వి.లాస్యశ్రీ 586 మార్కులతో రెండు, మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు స్కూల్ టాపర్, జిల్లాలో రెండవ స్థానం సాధించిన ప్రణీత్ కుమార్‌ను సత్కరించి అభినందించారు.

ఎస్‌టీవీఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):మధురానగర్‌లోని ఎస్‌టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలలో మొత్తం 96 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 70 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 500కి పైగా మార్కులు సాధించిన వారు 16 మంది ఉన్నారు. పాఠశాలలో 575 మార్కులతో పి.హేమశిరి పాఠశాల టాపర్‌గా నిలవగా, జి.డింపుల్ శ్రావణి 551, ఐ.శ్రుతి 544 మార్కులతో రెండు, మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

ఉగ్రవాద భూతాన్ని తరిమికొట్టాలి



క్యాండిల్‌తో ర్యాలీ చేస్తున్న మల్లాది విష్ణు తదితరులు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్, బైసారాన్ వ్యాలీలో జరిగిన ఘటన అత్యంత బాధాకరమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ.. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనం వరకు బుధవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న విష్ణు మాట్లాడుతూ కాశ్మీర్‌కి మన దేశం నుంచే కాకుండా ప్రపంచ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు నిత్యం వస్తుంటారని చెప్పారు. ఇటువంటి తరుణంలో ప్రకృతి అందాలను చూసి పరవశిస్తున్న పర్యాటకులను ఉగ్రమూకలు దారుణంగా కాల్చి చంపటం అమానవీయ చర్య అని మండిపడ్డారు. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు లేదని తెలిపారు. 28 మందిని పొట్టన పెట్టుకోవటం కలచి వేసిందన్నారు. ఘటనలో ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. ఇది మన దేశ ఐక్యత, సమగ్రతపై దాడి అని.. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు ఈ ఉగ్రవాద చర్యను ఖండించాలన్నారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి మారణ కాండను సృష్టించిన ఉగ్రవాదులు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు పాలిమెట్ల శరత్‌కుమార్, అలంపూరు విజయ్, మేడా రమేష్, వరలక్ష్మీ, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కాగడాల ప్రదర్శన

విజయవాడ కల్చరల్: దేశ సార్వభౌమత్వానికి సమగ్రతకు పెను సవాల్ విసురుతున్న ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహించాలని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. హిందూ జేఏసీ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్‌రోడ్డులో కాశ్మీర్‌లో హిందువులపై జరిగిన దాడిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ కాశ్మీర్‌లో యాత్రికులపై తూటాలు కురిపించిన సంఘటన యావత్ హిందూ జాతిని కలచివేసిందన్నారు. ఉగ్రవాదులను తుదుముట్టించడానికి కేంద్ర బలగాలను కాశ్మీరుకు పంపాలని సూచించారు. శివస్వామి మాట్లాడుతూ కాశ్మీర్‌లో హిందువులని నిర్ధారించుకున్న తరువాతనే వారిని హతమార్చారన్నారు. కాశ్మీర్‌లో మరణించిన హిందువులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో నాగలింగం శివాజీ, అవుటపల్లి శివప్రసాద్, విశ్వహిందూ పరిషత్ నగర ఉపాధ్యక్షుడు జేఏసీ నాయకులు, కృష్ణభగవాన్, జింకాచక్రధర్,కొరప్రోలు శ్రీనివాస్,తదితరులు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో నిరసన తెలియ జేస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరామ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ



విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ప్రిన్సిపల్ సురేష్, డైరక్టర్ మాధురి, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సింగ్‌నగర్‌లోని శ్రీరామ్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. పాఠశాలకు చెందిన గొట్టిపాటి వైష్ణవి, ఓ.జాహ్నవి అనే విద్యార్థులు 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. తమ పాఠశాల విద్యార్థులు 97 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించడంతో ఆ పాఠశాల ఎదుట బుధవారం బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ బోను సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్, డైరక్టర్ బి.మాధురి మాట్లాడుతూ 2025 పదో తరగతి పరీక్ష ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యద్భుత మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇద్దరు విద్యార్థులు 590 మార్కులు తెచ్చుకోగా 34 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా 34 మంది, 500 మార్కులు పైగా 77 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వివరించారు.

చెడుగా ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు

పాయకాపురం(విజయవాడ రూరల్): తన కుమార్తెల గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడని, పెళ్లి సంబంధాలు చెడగొడతున్నట్లు వచ్చిన ఫిర్యాదు పై నున్న పోలీసులు బుధవారం ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నున్న గ్రామానికి చెందిన వర్రి జయలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె భర్త 13 సంవత్సరాల క్రితం చనిపోవడంతో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈ క్రమంలో ఆమె ఆగిరిపల్లికి చెందిన సముద్రా రవికిరణ్‌తో సహజీవనం చేస్తోంది. రవికిరణ్ తన పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, పిల్లలకు వచ్చిన పెళ్లి సంబంధాలను చెడగొడుతున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యవతకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్క్రీన్ ప్రింటింగ్, పెయింటింగ్ ఆర్టికల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

దుర్వాసన నుంచి విముక్తి

పగిలిన ప్రధాన యూజీడీ పైపులైనుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కొన్ని రోజుల నుంచి పగిలిపోయిన యూజీడీ ప్రధాన పైపులైన్‌కు కార్పొరేషన్ అధికారులు బుధవారం మరమ్మతులు చేయించారు. స్థానిక 59వ డివిజన్ నార్త్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఎదురుగా యూజీడీ ప్రధాన పైపులైను పగిలిపోయింది. దీని నుంచి నిత్యం మురుగు నీరు లీకై రోడ్లు మీద ప్రవహిస్తుండడడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసనలతో నిండిపోయింది. ఈ సమస్యతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను తెలుపుతూ సాక్షి పత్రికలో 'అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం..' అనే శీర్షికతో బుధవారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన కార్పొరేషన్ ఉన్నతాధికారులు పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. రోడ్డుపై పేరుకుపోయిన మురుగును శానిటరీ సిబ్బందితో తొలగించారు. మురుగు దుర్వాసన నుంచి తమకు విముక్తి లభించడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



మొన్న.. పైపులైను లీకయి.. చుట్టూ మురుగునీరుతో ఇలా



నేడు.. మరమ్మతులు చేయించిన తరువాత శుభ్రంగా ఉన్న అదే ప్రదేశం

చార్లెస్ శోభరాజ్ భవన్ అని నామకరణం చేయండి

మాజీ ఎంపీ నాని విమర్శనాస్త్రాలు

విజయవాడస్పోర్ట్స్: గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కూర్చొని అక్రమ ఇసుక, ఫ్లై యాష్ తోలకం, గ్రావెల్ అమ్మకాలు, భూ దందాలు, బ్రోకరేజీలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తూ, రేషన్ బియ్యం మాఫియాకు కొమ్ము కాస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై మాజీ ఎంపీ కేశినేని నాని ఫేస్‌బుక్, ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. విజయవాడ ప్రజలు చరిత్రలో లేని విధంగా భారీ మెజారిటీతో తనను గెలిపించుకున్నారని గర్వంగా చెప్పుకునే ప్రజా ప్రతినిధి కార్యాలయం పేరు 'ఎన్టీఆర్ భవన్' అని పోస్ట్‌లో పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, నీతి, నిజాయితీకి మారుపేరు, ప్రజా సేవ అంటే చాలా పవిత్రమైన కార్యక్రమం అని ప్రపంచానికి చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, ఆయన పేరును కార్యాలయానికి పెట్టుకుని ఆ కార్యాలయంలో కూర్చుని అక్రమ దందాలకు పాల్పడుతుండటాన్ని తప్పుబట్టారు. కార్యాలయానికి వెంటనే ఎన్టీఆర్ పేరును తొలగించి ప్రపంచ స్థాయి స్మగ్లర్ అయిన 'చార్లెస్ శోభరాజ్' పేరును కార్యాలయానికి పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఇది భారీ మెజార్టీతో ఎంపీగా నిన్ను గెలిపించిన విజయవాడ ప్రజల కోరికగా పోస్ట్‌లో అభివర్ణించారు.

అల్జీ నివారణకు ప్రత్యేక చర్యలు

హెడ్ వాటర్ వర్క్స్ సందర్శనలో కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని డాక్టర్ కేఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సందర్శించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి నీటిలో అల్జీ విపరీతంగా పెరుగుతుందని, తద్వారా నీటిలో తేలియాడే పదార్థాలు అధికం కావడం, ఫిల్టర్ బెడ్స్‌లో నీటి ఫిల్టరేషన్ రేటు పడిపోతుందని వివరించారు. దీని వల్ల నీటి రంగు మారి, దుర్వాసన వస్తుందని చెప్పారు. దీనిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇన్‌టేక్ వెల్ వద్ద అల్జీ ప్రవేశాన్ని నివారించేందుకు, నీటిలో ఆక్సిజన్ స్థాయిని పెంచి దుర్వాసన తగ్గించేందుకు కృష్ణానదిలో పెడల్ ఏరేటర్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇన్‌టేక్ వెల్ చుట్టూ చిన్న రంధ్రాలు ఉన్న క్లాత్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తేలియాడే పదార్థాలు, అల్జీ, చిన్న చేపలు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఉత్పత్తి పరిమాణం 185 ఎంఎల్‌డీ నుంచి 204 ఎమ్ఎల్‌డీకి పెరిగిందన్నారు.